క్లుప్తంగా

ఆంజనేయస్వామిని దర్శించుకున్న వాసుపల్లి



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ నగరంలోని పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో వెలసిన ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘోషాస్పత్రిలో భోజనాల పంపిణీ



పేషెంట్ల సహాయకులకు భోజనాలు అందిస్తున్న దాత వేదుల జ్యోతి, సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న పేషెంట్ల సహాయకులకు దాతల సహకారంతో స్వామి వివేకానంద సంస్థ మంగళవారం భోజనాలు పంపిణీ చేసింది. దాత వేదుల జ్యోతి పేషెంట్ల సహాయకులకు భోజనాలు అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి దూర ప్రాంతాల నుంచి వస్తున్న పేషెంట్ల సహాయకులకు భోజనాలు అందించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భానోజీరావు, పైడిరాజు, ఉమాదేవి, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్టపై కఫం పరీక్షలు



గోవిందరోడ్డులో కఫం సేకరిస్తున్న హెచ్‌వీ మేరీ రత్నం, ఆశ వర్కర్ లీలావతి

అల్లిపురం : కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్ట పరిధిలో కఫం పరీక్ష నిర్వహించారు. టీబీ హెచ్‌వీ జి. మేరీరత్నం, డి.నాగేశ్వరరావు ఆశ వర్కర్ బి.లీలావతితో కలిసి గోవిందరోడ్డు, ఎరుకలవీధి, సింహాలదేవిడి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కఫం నమూనాలు సేకరించారు. దగ్గు, కఫం ఉన్నవారికి సలహాలు అందజేశారు. కఫం శాంపిల్స్ కలెక్ట్ చేసి పరీక్షల నిమిత్తం పంపించినట్లు టీబీ హెచ్‌వీ మేరీ రత్నం తెలిపారు. కఫం అధికంగా ఉండి, దగ్గు అతిగా వస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

వరద బాధితులకు రూ.లక్ష సాయం



ఎమ్మెల్యే వంశీని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

డాబాగార్డెన్స్: చారిత్రాత్మకమైన వైజాగ్ పటం క్లబ్ నంబర్ వన్‌గా ఎదగడానికి సహకారమందిస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా నియమించడంతో పాటు వంశీని క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ విశాఖలో నంబర్ వన్ క్లబ్‌గా వైజాగ్‌పటం క్లబ్ ఎదగాలన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం క్లబ్ సభ్యులు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), కార్యదర్శి డాక్టర్ బి. రాజాపాత్రుడు, ఉపాధ్యక్షుడు నరవ రాంబాబు, చీఫ్ అడ్వైజర్ గ్రంధి విష్ణు, అడ్వైజర్ భరత్, వెంకటరెడ్డి, కృష్ణంరాజు, రెడ్డి శ్రీనివాస్, తలారి శ్రీనివాస్, స్థానిక టీడీపీ నాయకుడు గోడి నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.







అనాథలకు క్షవరం చేస్తున్న పట్నాన చిన్నారావు

- అభాగ్యులకు ఉచితంగా క్షురక సేవ
- 20 ఏళ్లుగా కొనసాగిస్తున్న అన్నదమ్ములు

అలుపెరుగకుండా అనాథల సేవలో..

ప్రతి మనిషి సేవాభావంతో మెలిగితే సమాజం స్వర్గం అవుతుంది. ఎదుటి వ్యక్తికి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఏ చిన్నపాటి సాయం చేసినా అది నేరుగా పరమాత్ముని తాకుతుంది. ఈ సత్యం అవగతం అయితే.. తోటి వారికి బాసటగా నిలిచినప్పుడు దొరికే సంతృప్తి అనుభవంలోకి వస్తే ఎవరైనా సేవా మార్గాన్ని ఎంచుకుంటారు. క్షురక వృత్తి చేస్తూ జీవించే ఇద్దరు అన్నదమ్ములు ఎప్పుడో చిన్నప్పుడు విన్న ఒక మాస్టారి మాటలతో సేవామార్గాన పయనిస్తున్నారు. అనాథలు, అభాగ్యులకు ఉచితంగా క్షురక సేవ చేస్తూ నలుగురి మన్ననలు అందుకుంటున్నారు.



పందిమెట్టలోని పట్నాన చిన్నారావు, గంగరాజుల సెలూన్

అల్లిపురం: సేవ చేయాలనే సంకల్పం ఉండాలే గాని దానికి ఆ దేవుడే దారి చూపిస్తాడు. పరులకు సేవ చేసేందుకు డబ్బుతో పనేంటని ఆ ఇద్దరు అన్నదమ్ములు నిరూపించారు. తాము చేసే వృత్తిలోనే సేవను వెదుక్కున్నారు. చేసేది క్షురక వృత్తి కావడంతో అందులోనే సేవా తత్పరత చాటుకుంటున్నారు. వారికి దొరికే ఒకరోజు సెలవును అందుకు వినియోగించుకుంటున్నారు. అనుకున్నదే తడువు వారి సేవా కార్యక్రమాలను అమలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

ఇరవై ఏళ్ల క్రితమే..

ప్రస్తుత మన్యం జిల్లా పార్వతీపురంలోని మార్కొండపుట్టి గ్రామం నుంచి ఇరవై ఏళ్ల క్రితం పొట్ట చేత పట్టుకుని నగరానికి వచ్చారు పట్నాన చిన్నారావు. ఫుట్‌పాత్‌పై క్షవరం చేస్తూ పందిమెట్ట వద్ద ఒక బడ్డీ ఏర్పాటు చేసుకుని సెలూన్ షాప్ తెరిచారు. తర్వాత సోదరుడు పట్నాన గంగరాజును తీసుకొచ్చారు. ఇద్దరు కలిసి తమ వృత్తి కొనసాగిస్తున్నారు. చిన్నప్పుడు వారి ముద్దు మాస్టారు చెప్పిన మాటలు వారికి స్ఫురణకు వచ్చాయి. మానవ సేవే మాధవ సేవ అని అతను చెప్పిన మాటలను ఎలా అమలు చేయాలి అని ఆలోచనలో పడ్డారు. అందుకు వారి వద్ద గల వనరులను బేరీజు వేసుకున్నారు. ఆర్థికంగా అంతగా బలం లేకపోవటంతో తమ వృత్తితోనే సేవా కార్యక్రమాలు చేయాలనుకున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో నిరాదరణకు గురయ్యే అనాథలను ఎంచుకున్నారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లపై పెరిగిన గడ్డాలు, చింపిరి జుట్టుతో ఉండే వారికి క్షవరం చేసి వారి సేవలో తరించాలని సంకల్పించుకున్నారు. అన్నదే తడువు మంగళవారం సెలవు రోజును సేవా కార్యక్రమానికి వినియోగించాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి మంగళవారం నగరంలో బైక్ వేసుకుని, క్షవరం కిట్లు పట్టుకుని రోడ్డున పడతారు. జగదాంబ, కేజీహెచ్, బీచ్‌రోడ్డు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలతో పాటు అనాథాశ్రమాలలో ఉండే వారికి క్షవరం చేస్తూ సంతృప్తి చెందుతున్నారు.

లాలనగా దగ్గరకు తీసుకుని..

సాధారణ ప్రజలకు క్షవరం చేయడమే కష్టం. తల అటుఇటు తిప్పుతుంటారు. ఈ క్రమంలో ఒక్కోసారి కత్తిగాట్లు పడుతుంటాయి. అటువంటిది మానసిక దివ్యాంగులకు క్షవరం చేయడం ఎంత కష్టమో ఊహించుకోవచ్చు. అందుకే వారిని బ్రతిమలాడి, దగ్గరకు తీసుకుని క్షవరం చేస్తుంటారు. అయినప్పటికీ వారు పారిపోతుంటారు. వారిని తిరిగి తీసుకొచ్చి క్షవరం చేసి, స్నానం చేయించి శుభ్రపరచటమంటే మామూలు విషయం కాదు. ఆ కష్టమంతా చిన్నారావు, గంగరాజు ఇష్టంగానే భరిస్తుంటారు.

మా మాస్టార్ ప్రవచనాలే స్ఫూర్తి..



మా చిన్నప్పుడు మా ఊర్లో ప్రతి రోజు ముద్దు మాస్టారు ప్రవచనాలు వినేవారం. ఆయన ప్రవచనాల స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమం ప్రారంభించాం. దేవుడిచ్చిన శక్తి ఉన్నంత కాలం మా తల్లిదండ్రుల దీవెనలతో ఈ సేవను కొనసాగిస్తాం. ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయడంలో సంతృప్తి పొందుతున్నాం.

– పట్నాన చిన్నారావు

వృత్తిలోనే సంతృప్తి..



మేము చేసే సేవలో మాకు సంతృప్తి ఉంది. మా వృత్తిని మేము కొనసాగిస్తూ సేవను కొనసాగించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాం. మేమున్నంత కాలం ఈ సేవను కొనసాగిస్తాం. అనాథల సేవలో మాధవుడిని చూసుకుంటున్నాం. భగవంతుడు మాకిచ్చిన అవకాశం వినియోగించుకుంటాం.

– పట్నాన గంగరాజు

వయో వృద్ధులకు విశ్రాంతి భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

డాబాగార్డెన్స్ : విశాఖ నగరంలో సుమారు 3 లక్షల మందికి పైగా వయో వృద్ధులు ఉన్నారని, వీరికి వినోదం, కాలక్షేపం, విశ్రాంతికి విశాలమైన భవనం అవసరమని నాగార్జున యూనివర్శిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ కలయిక మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సుమారు 350 మందికి పైగా సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ 2007లో కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నగరంలోని వయోవృద్ధుల సంఘం విశ్రాంతి భవనం కోసం అభ్యర్థించగా బీచ్‌రోడ్డులో దాదాపు 1600 గజాల స్థలాన్ని కేటాయించి అందులో ఆరున్నర కోట్ల వ్యయంతో సువిశాల ప్రాంగణాన్ని నిర్మించాల్సిందిగా అప్పట్లో వుడా అధికారులను ఆదేశించారని, అందుకు అనుగుణంగా 1560 గజాల స్థలాన్ని బీచ్‌రోడ్డులో కేటాయించి, భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరిగిందని, అప్పటి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బొత్స సత్యనారాయణ, కన్నా లక్ష్మీనారాయణ ఆ కార్యక్రమంలో పాల్గొని శంకుస్థాపన చేశారని చెప్పారు. అనంతరం వుడా అధికారుల వైఖరి కారణంగా అక్కడి భవన నిర్మాణం జరగకపోగా, ఆ ప్రాంతం చెత్త నిలయంగా మారిందని బాలమోహన్‌దాస్ వివరించారు. సంఘం అధ్యక్షుడు కె. మంగపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్ కలిగొట్ల రవిశంకర్ మ్యాజిక్ కళను ప్రదర్శించారు. ఆరిజన్ ప్రకృతి చికిత్సా కేంద్ర వైద్యురాలు డాక్టర్ జ్యోత్స్న అనేక ఆరోగ్య చిట్కాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పీకే జోష్, వి. డెంటల్ ఆస్పత్రి నిర్వాహకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థులకు పతకాలు

సీతంపేట : ఇటీవల తిరుపతిలో చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుషుల, మహిళల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి పి.సాయిలోహిత్ కుమార్ 54 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి కె.భాగ్యరాజు 87 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్ తదితరులు

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

- కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినాన్ని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెక్రియాటిస్ట్ బి.నిత్య ఐశ్వర్య మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని బద్దలు చేయాలన్నారు. ఈ రోజుల్లో ప్రతి 20 సెకండ్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ శాతం యువత ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణకై సమాజంలో మార్పు తీసుకురావాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. మానసిక ఇబ్బంది ఉన్న వారు గవర్నమెంట్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14416 ద్వారా మానసిక వైద్యుల సలహాలు, పొందవచ్చని జాతీయ సేవా పథకం అధికారి పోలా ఉమామహేశ్వరరావు సూచించారు.



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

ఆరు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కి చెందిన సునీల్ మేఘవాల్ (23) ఒడిశాలో గంజాయి కొనుగోలు చేశాడు. ఆ సరకుతో మంగళవారం రామాటాకీస్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడే ఉన్న ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో సదరు నిందితుడు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసినట్లు అంగీకరించాడు. ద్వారకా స్టేషన్ సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో ఎస్‌ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి అన్న ప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని చిన వాల్తేరు ప్రాంతానికి చెందిన సాయిదిలీప్‌శర్మ రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దాతకు బాండ్‌ని ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం,శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. సీనియర్ అసిస్టెంట్ వరహాల రావు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

ఈ తప్పిదానికి ప్రధాన కారణం చంద్రబాబే

- కోవిడ్ సమయంలో జగన్ ప్రభుత్వం చేసిన సేవలు గుర్తు లేవా?
- వరదలు ముంచెత్తి 10 రోజులైనా ఇంకా పులిహోర పొట్లాలే పంపిణీ
- అక్కడే తెలుస్తోంది ఈ ప్రభుత్వం సత్తా ఏమిటో
- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్



డాబాగార్డెన్స్: చంద్రబాబు కూటమి ప్రభుత్వం విజయవాడ ప్రజలకు 1964 సినిమా చూపిస్తోంది. విజయవాడలో 60 ఏళ్ల కిందట వచ్చిన విపత్తు తర్వాత శాస్త్ర సాంకేతిక రంగం అనూహ్యంగా అభివృద్ధి చెందినప్పటికీ విజయవాడ ప్రజలకు మాత్రం చంద్రబాబు అప్పటి సినిమాయే చూపిస్తున్నారంటే ఏమనుకోవాలి. టెక్నాలజీ అభివృద్ధి చెందిన ఈ తరుణంలో ఏ విషయాన్నైనా 24 గంటల్లోనే సరి చేసుకోవచ్చు. చంద్రబాబు విజనరీ నాయకుడు అంటారు. మరి ముందు చూపు లేదా? విపత్తు రాకుండా కాపాడే నాయకుడే అసలైన నాయకుడు. గత 10 రోజులుగా విజయవాడ వాసులకు నిద్ర లేకుండా చేశావ్. ఎంతో మందిని అనాథలను చేశావ్. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. కానీ నీవు పెడచెవిన పెట్టావ్. చంద్రబాబు, రామానాయుడు గొడ్డులా కష్టపడిపోతున్నారంటున్నారు. అంతా జరిగిపోయిన తర్వాత చేయకపోతే ఎలా? ఈ విపత్తులో పేదవాడు కనీసం రూ.5 లక్షల ఆస్తి నష్టం, ఉన్నవాడు రూ.10 లక్షల ఆస్తి నష్టానికి గురయ్యాడు. విజయవాడ ఘటనపై మానవతా దృక్పథంతో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఎంతో డబ్బు సాయమందిస్తున్నారు. దానికి అకౌంట్‌బిలిటీ లేదు. దాతలు ఇచ్చిన సొమ్ముకు శ్వేతపత్రం విడుదల చేయాలి. ఇప్పటి వరకు 25 శాతం కూడా నీ ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తి కాలేదు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉండి ఉంటే..

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉండి ఉంటే.. విజయవాడ ప్రజలకు ఈ దుస్థితి వచ్చేది కాదు. ఒక్క రోజులోనే విజయవాడకు సప్లై అందించేవారు. రెండు మూడు రోజుల్లోనే సహాయక చర్యలు శత శాతం అందేలా చూసేవారు. వారం రోజుల్లోనే నిర్వాసితులకు ఎంతో కొంత డబ్బిచ్చేవారు. కోవిడ్ సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సేవలు దేశమే కాదు.. యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. వలంటీర్ల సాయంతో సేవలందించారు. జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కోవిడ్‌లో వేలాది మంది ప్రాణాలు కాపాడుకున్నారు. కోవిడ్ వచ్చిన వ్యక్తి ఎవర్ని కలిసాడు.. ఎక్కడికి వెళ్లాడు.. ప్రతీది వలంటీర్ ద్వారా తెలుసుకోగలిగాం.

వక్తృత్వ పోటీల్లో మహిళా కళాశాల విద్యార్థిని సత్తా



కిరణ్మయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: ఎల్ఐసీ 68వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా అంతర్ కళాశాల వక్తృత్వ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. కిరణ్మయికి తృతీయ బహుమతి వచ్చింది. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల కిరణ్మయిని అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వక్తృత్వ నైపుణ్యం ఉంటే విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణిస్తారని, విద్యార్థులను విజ్ఞాన పరంగా తీర్చిదిద్దడమే కాక సమాజంలో మనుగడ సాగించడానికి కావల్సిన నైపుణ్యం పెంపొందించడంలో ఇటువంటి పోటీలు చక్కగా తోడ్పడతాయన్నారు. కళాశాల లిటరరీ కన్వీనర్ బి. రాధమ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో భావప్రసార నైపుణ్యం పెంపొందించేందుకు వక్తృత్వ పోటీలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, విద్యార్థినులు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



దొండపర్తిలో పూజలందుకుంటున్న వినాయకుడు

సీతమ్మధార: దొండపర్తి రామాలయం సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో రోజూ పూజలు, భజనలు జరుగుతున్నాయి. శివ పార్వతులతో కూడిన వినాయక ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఉత్సవాలలో భాగంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు, సాము గరిడి, ప్రతి రోజూ భక్తులచే భజనలు నిర్వహిస్తున్నారు. అలాగే, అనుపు మహోత్సవానికి రెండు రోజుల ముందు మహా అన్నదానం నిర్వహిస్తామని సర్వేశ్వరరెడ్డి తెలిపారు.

ఆంథోనీనగర్‌లో..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు ఆంథోనీనగర్‌లో యూత్, స్థానిక మహిళలు నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆంథోనీనగర్ ప్రజలు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్ ఆపాలి



మాట్లాడుతున్న నర్సుల స్ట్రగుల్ కమిటీ స్టేట్ కో–ఆర్డినేటర్ కోటేశ్వరరావు

మహారాణిపేట: రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు నర్సులు గడచిన ఐదు రోజులుగా నిరసన తెలియజేస్తున్నారు. మంగళవారం కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సుల స్ట్రగుల్ కమిటీ స్టేట్ కో–ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 11న ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్స్‌లుగా పోస్టింగ్ ఇస్తూ నిర్వహించే కౌన్సెలింగ్‌ను నిలిపేయాలన్నారు. లేని పక్షంలో తమ నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నర్సింగ్ విద్యలో మూడు సంవత్సరాల డిగ్రీ చేసిన వారు, పీజీ చేసిన వారు కోవిడ్‌కు ముందు నుంచి కూడా తమ అమూల్యమైన సేవలు అందిస్తున్నారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.శాంతికుమారి, కె.సూర్యకళ, వి.వినీల, ఎస్.వరలక్ష్మి, ఎన్.శోభారాణి, వి. శేఖర్, సత్యనారాయణ, పోరాట కమిటీ సభ్యులు, హెడ్ సిస్టర్లు, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

49 మంది డ్రైవింగ్ లైసెన్సుల రద్దు



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ద్వారకా పోలీసులు రోజూ స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనల్లో తీసుకొచ్చిన మార్పులు ఈ నెల ఒకటి నుంచి అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వాహనదారులకు హెల్మెట్ లేకపోవడం, వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ లేకుండా వుంటే కేసులు నమోదు చేసి తాత్కాలికంగా డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్టేషన్ పరిధిలో గల ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, ఆశీలుమెట్ట, రామాటాకీస్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 49 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి. భాస్కరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 400 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు.